ప్రజాశక్తి
శుక్రవారం 20 సెప్టెంబర్ 2024

నేడు అనంతలో సీతారాం ఏచూరి సంతాప సభ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సిపిఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాప సభను శుక్రవారం నాడు అనంతపురంలో నిర్వహించనున్నారు. సిపిఎం ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు సప్తగిరి సర్కిల్లోని లలిత కళాపరిషత్‌లో ఈ కార్యక్రమం జరుగుతుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్ తెలియజేశారు. సంతాప సభలో టిడిపి ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, దగ్గుబాటి ప్రసాద్, వైసీపీ నుంచి మాజీ ఎమ్మెల్యేలు అనంత వెంకట్రామిరెడ్డి, వై.విశ్వేశ్వర రెడ్డి, అనంత మేయర్ వసీం, కాంగ్రెస్ నుంచి డాక్టర్ సాకే శైలజనాథ్, సిపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్, న్యూడెమోక్రసీ ఇండ్ల ప్రభాకర్ రెడ్డి, ఎంఎల్ పార్టీ చంద్రశేఖర్, ఎస్‌యుసిఐ రాఘవేంద్ర పాల్గొంటారన్నారు. వీరితో పాటు జిల్లాలోని మేధావులు, రచయితలు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొని సంతాపం తెలుపుతారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సాగునీటిపై అలసత్వం వద్దు

- ప్రతి నీటి చుక్కనూ సద్వినియోగం చేయాలి
- జలవనరుల అధికారులకు మంత్రి పయ్యావుల ఆదేశం
- ముగిసిన ఐఎబి సమావేశం

నీటి కేటాయింపులు ఇలా (టిఎంసిల్లో)

తుంగభద్ర ఎగువ		
ప్రధాన కాలువ వచ్చే నీరు	26.368	
తాగునీటికి	10.00	
సాగునీటికి	16.368	
హెచ్‌ఎల్‌ఎంసికి	2.506	10-08-2024
జిబిసి	2.359	10-08-2024
మిడ్‌పెన్నార్ దక్షిణ కాలువ	1.479	01-10-2024 (మూడు రోజుల్లో)
మిడ్ పెన్నార్ ఉత్తర కాలువ	0.640	01-10-2024
తాడిపత్రి బ్రాంచ్ కెనాల్	1.267	01-11-2024
మైలవరం జలాశయం	1.370	
పులివెందుల బ్రాంచ్ కెనాల్	1.506	01-11-2024

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

నిత్యం కరువు పీడిత ప్రాంతమైన ఉమ్మడి అనంతపురం జిల్లాలో సాగునీటి నిర్వహణపై ఏమాత్రం అలసత్వం వద్దని జలవనరుల శాఖ అధికారులకు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఆదేశించారు. సాగునీటి సలహా మండలి సమావేశం గురువారం నాడు అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో జరిగింది. జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌తోపాటు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌లు పాల్గొన్నారు. వీరితోపాటు జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, అమిలినేని సురేంద్రబాబు, బండారు శ్రావణి, జెసి.అస్మిత్‌రెడ్డి, గుమ్మనూరు జయరాం పాల్గొన్నారు. ఈ సందర్భంగా పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ సాగునీటి నిర్వహణలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి కిలోమీటరుకు అధికారులను, సిబ్బందిని బాధ్యులను చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు విధిగా క్షేత్రస్థాయి పర్యటనలు జరిపి ఎక్కడ సమస్యలొస్తే అక్కడ వెంటనే పరిష్కరించే విధంగా ఉండాలని చెప్పారు. హంద్రీనీవా అధికారులు, తుంగభద్ర అధికారులు ఎవరికివారుగా కాకుండా పరస్పరం సమన్వయంతో నీటి నిర్వహణతో ముందుకెళ్లాల్సిన అవసరం ఉందని సూచించారు.

నిధులు రావడం లేదు
ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

రైతుల నుంచి నీటి తీరువాను వసూలు చేస్తున్నప్పటికీ నిర్వహణకు ఇవ్వాల్సిన నిధులను కాడా నుంచి గత కొన్నేళ్లుగా రావడం లేదని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు చెప్పారు. జిల్లా నుంచి సుమారు రూ.13 కోట్లకుపైగా నీటి తీరువా కట్టింది ఉందన్నారు. ఇప్పటికైనా ఎన్ని నిధులు రావాల్సి ఉందన్నది అధికారులు చెప్పాలన్నారు. ఆ నిధులైనా వస్తే సాగునీటి పంట కాలువల మరమ్మతులకు ఉపయోగించుకునేందుకు వీలు కలుగుతుందన్నారు. తుంగభద్ర డ్యామ్ ప్రధాన గేటు కొట్టుకుపోయినప్పుడు యుద్ధ ప్రాతిపదికన గేట్ల ఏర్పాటుకు కృషి చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, జలవనరుల శాఖ మంత్రి రామానాయుడు, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ఇంజినీర్ కన్నయ్య నాయుడులను కృతజ్ఞతలు తెలుపుతూ తీర్మానాన్ని ప్రతిపాదించారు. అదే విధంగా గేటు కొట్టుకుపోయిన అంశంపై విచారణకు ఆదేశించాలని కోరుతూ బోర్డుకు లేఖ రాయాలన్న తీర్మానాన్ని ప్రతిపాదించారు.

నీటిని ముందుగా విడుదల చేయాలి
ఎమ్మెల్యే బండారు శ్రావణి

మిడ్‌పెన్నార్ దక్షిణ కాలువ కింద పంటలకు ఇబ్బందికరంగా ఉందని, తక్షణం నీటిని విడుదల చేయాలని శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ కోరారు. అజెండాలో పొందుపరచిన విధంగా అక్టోబరు 10వ తేదీ అయితే ఆలస్యం అవుతుందని చెప్పారు. దీనిపై మంత్రి పయ్యావుల కేశవ్ స్పందిస్తూ కాలువలను ముందుగా పరిశీలించి, రెండు రోజుల్లో నీటిని విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు.

గండి పూడిస్తేనే ప్రయోజనం
ఎమ్మెల్యే జెసి.అస్మిత్‌రెడ్డి

మిడూతూరు వద్ద మిడ్ పెన్నార్ ఉత్తర కాలువకు గండిపడిందని సమావేశం దృష్టికి తాడిపత్రి ఎమ్మెల్యే జెసి.అస్మిత్‌రెడ్డి తీసుకొచ్చారు. ఈ పరిస్థితుల్లో నీరు వదిలినా ప్రయోజనం ఉండదన్నారు. గతంలో తీసిన పూడిక తీసి మట్టి అక్కడే వేయడంతో అది తిరిగి చేరి కాలువలు పూడుకుపోతున్నాయన్నారు. గండిని పూడ్చితేనే ప్రయోజనం అన్నారు. దీనిపై మంత్రి పయ్యావుల కేశవ్ స్పందిస్తూ సంబంధిత అధికారులు ఈ ప్రాంతంలో క్షేత్ర స్థాయి పర్యటన జరిపి తక్షణం గండి పూడ్చి నీరు వృథాకాకుండా వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

సమావేశంలో పాల్గొన్న మంత్రులు పయ్యావుల కేశవ్, సత్యకుమార్

తాగునీటి సమస్య లేకుండా చూడండి
ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

అనంతపురం అర్బన్ నియోజకవర్గ పరిధిలో జనాభా పెరిగిన నేపథ్యంలో అందుకు అనుగుణంగా తాగునీరు సరఫరా చేయాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. పీఏబీఆర్ నుంచి వస్తున్న నీటి కేటాయింపులను పెంచి తాగునీటి సమస్య లేకుండా చేయాలన్నారు. వేసవిలో తాగునీటి సమస్య రాకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నేషనల్ పార్క్‌లో ఉన్న చెక్ డ్యాంకు నీరు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

జిబిసికి నీళ్లు తగినన్ని వదలడం లేదు
ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

జిబిసికి ప్రస్తుతం 230 క్యూసెక్కులకు మించి రావడం లేదని ఎమ్మెల్సీ శివరామిరెడ్డి తెలిపారు. దీంతో దిగువనున్న ఆయకట్టుకు నీరందటం లేదని అన్నారు. కరముక్కల వద్ద కాలువ దెబ్బతిందన్నారు. వీటిని పరిశీలించి చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

అవగాహన చేసుకోవాల్సి ఉంది
సత్యకుమార్, వైద్యఆరోగ్య శాఖ మంత్రి

ఉమ్మడి జిల్లాలో సాగునీటి నిర్వహణపై ఇంకా తాను అవగాహన చేసుకోవాల్సి ఉందని వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. ఏది ఏమైనా అత్యల్ప వర్షపాతం కలిగిన అనంతపురం జిల్లాలో నీటిని సద్వినియోగం చేసుకునే విధంగా అందరం కలసి పనిచేయాల్సిన అవసరం ఉందని చెప్పారు.

సాగునీటి వసతి లేని ప్రాంతం మాది..
ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం ఏ మాత్రం సాగునీటి వసతి లేని ప్రాంతంగా ఉందని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గతంలో బిటిపి ద్వారా ఈ ప్రాంతానికి నీటిని అందిస్తామని హామీనిచ్చారని గుర్తుచేశారు. ఎన్నికల సమయంలోనూ ఈ హామీని ఇచ్చామని గుర్తు చేశారు. భూసేకరణకు నిధులు విడుదల చేస్తే, నిర్మాణ పనులను ప్రారంభించడానికి వీలవుతుందని చెప్పారు.

సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు

ముగిసిన స్కూల్ గేమ్స్ పోటీలు

ప్రజాశక్తి-గుడిబండ

స్థానిక జడ్పీ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న మండల బాలికల స్కూల్ గేమ్స్ పోటీలు గురువారం ముగిశాయి. మండలంలోని అన్ని పాఠశాలల బాలికలకు యోగా, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, చెస్, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలను అండర్-14, అండర్-17 విభాగాల్లో పోటీలు నిర్వహించారు. హెచ్‌ఎం గోవిందప్ప పోటీలను ప్రారంభించగా పిఇటిలు సాయికృష్ణ, అజరుద్దీన్, కొండప్ప, ఓంప్రకాష్ రెడ్డి, విజయకుమారి, బాబు, విగ్నేష్, గౌరీ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, బాలికలు పాల్గొన్నారు.

ఎంపికైన బాలికలు

అండర్-17 విభాగంలో 400 మీటర్ల లాంగ్ జంప్‌లో సౌమ్య(గుడిబండ), రక్షిత (గుడిబండ కెజిబివి), మేఘన(కెఎన్.పల్లి), హై జంప్‌లో అమూల్య(జమ్మలబండ), జననిశ్రీ(గుడిబండ), వంద మీట ర్ల హైజంప్‌లో జననిశ్రీ(గుడిబండ), అమూల్య(జమ్మలబండ), 200 మీటర్ల హైజంప్‌లో సౌమ్య (గుడిబండ), భారతి (గుడిబండ కెజిబివి), అండర్-14 విభాగంలో లాంగ్ జంప్‌లో లిఖిత (జమ్మల బండ), ప్రీతి(గుడిబండ కెజిబివి), 400 మీటర్ల హై జంప్‌లో లిఖిత(జమ్మలబండ), కోమల (గుడిబండ), వంద మీటర్ల హై జంప్‌లో సంజన(జమ్మలబండ), వర్షిత(గుడిబండ కెజిబివి), 200 మీటర్ల హై జంప్ లో సంజన(జమ్మలబండ), సంధ్య(గుడిబండ), 400 మీటర్ల హై జంప్‌లో చంద్రకళ (జమ్మల బండ), కోమల(గుడిబండ) ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచినట్లు వ్యాయామ ఉపాధ్యాయులు సాయికృష్ణ, అజరుద్దీన్, ఓంప్రకాష్‌రెడ్డి తెలిపారు. పోటీలను హెచ్‌ఎం గోవిందప్ప, ఆయా పాఠశాలల పిఇటిలు పర్యవేక్షించారు.

కబడ్డీ పోటీలో పాల్గొన్న బాలికలు

దశల వారీగా 'సూపర్ సిక్స్' అమలు
ఎమ్మెల్యే ఎంఎస్.రాజు

ప్రజాశక్తి-మడకశిర

గత ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన మేనిఫెస్టో ప్రకారం సిఎం చంద్రబాబు దశల వారీగా సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే ఎంఎస్.రాజు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్లు ప్రారంభించారన్నారు. దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ పథకం అమలు చేస్తామని స్పష్టం చేశారన్నారు. వంద రోజుల పాలనపై ప్రతి ఒక్కరూ సంతృప్తిగా ఉన్నారని, ఇది చూసి ఓర్వలేని వైసిపి నాయకులు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని గుర్తు చేశారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రతి ఒక్కరినీ ఆదుకునే విధంగా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి వంద రోజుల పాలనను జయప్రదంగా పూర్తి చేశారని తెలిపారు.

చురుగ్గా తాగునీటి పైపులైన్ పనులు

మడకశిర : మండలంలోని కల్లుమర్రి పంచాయతీ పరిధిలోని వివిధ గ్రామాల్లో తాగునీటి పైపులైన్ పనులు చురుగ్గా సాగుతున్నాయని సర్పంచి గంగమ్మనాగరాజు తెలిపారు. ఎమ్మెల్యే ఎంఎస్. రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆదేశాల మేరకు పంచాయతీ పరిధిలోని ప్రతి గ్రామం లో పైపులైన్ ఏర్పాటుచేసి ప్రతి ఒక్కరికీ తాగునీరు అందిస్తామని సర్పంచి తెలిపారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

మడకశిర : రొళ్ల మండలంలోని చిగమతిగట్ట ప్రాథమిక పాఠశాలను గురువారం మాజీ ఎమ్మెల్సీ గుండు మల తిప్పేస్వామి సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. అనంతరం స్థానిక తెలుగు యువత, జనసేన నాయకులు సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ చిత్రపటాలను అందించగా గుండుమల వాటిని హెచ్‌ఎంకు అందజేశారు. కార్యక్రమంలో మడకశిర పట్టణ టిడిపి అధ్యక్షుడు మనోహర్, నాయకులు బేగార్లపల్లి రవికుమార్, సన్న తిమ్మప్ప, సిద్ధగంగప్ప, బాలకృష్ణ, ఉగ్రేగౌడ, నారాయణప్ప, చంద్రప్ప, తదితరులు పాల్గొన్నారు.

పవన్‌కళ్యాణ్, చంద్రబాబు, నారా లోకేష్ చిత్ర పటాలను హెచ్‌ఎంకు అలందిస్తున్న టిడిపి, జనసేన నాయకులు

సేవా పురస్కారం అందుకుంటున్న ఉమర్ ఫారూఖ్ ఖాన్

ఉమర్ ఫారూఖ్ ఖాన్‌కు సేవా పురస్కారం

హిందూపురం : పట్టణానికి చెందిన ఉమర్ ఫారూఖ్ ఖాన్ బజ్మ్ ఏ షాహీన్ ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకున్నారు. కర్నాటక రాష్ట్రం బెంగళూరులోని రవీంద్ర కళాక్షేత్రంలో బుధవారం రాత్రి 47వ జాతీయ ఉర్దూ కవి సమ్మేళన కార్యక్రమం జరిగింది. పట్టణానికి చెందిన సామాజిక సేవకులు, ఉర్దూ కవి ఉమర్ ఫారూఖ్ ఖాన్ పాల్గొని ప్రస్తుత సమాజంపై రచించిన ఉర్దూ కవితలను అక్కడ వినపించారు. దానిని మంచి కవిత్వంగా ఎంపిక చేసి మాజీమంత్రి రోషన్ బేగ్, సామాజిక సేవకులు బాబాజీ, మౌలానా సయీద్ బాఖవీ చేతుల మీద ఉమర్ ఫారూఖ్ ఖాన్‌కు బజ్మ్ ఏ షాహీన్ ఉత్తమ సేవా పురస్కారం అందించి, సన్మానించారు. కార్యక్రమంలో దేశంలోని వివిధ ప్రాంతాల ఉర్దూ సేవకులు, కవులు, రచయితలు పాల్గొన్నారు.

రాయితీపై ఉలవలు పంపిణీ

అమరాపురం : స్థానిక వ్యవసాయ అధికారి కార్యాలయంలో గురువారం ఏవో మంజునాథ్, టిడిపి మండల కన్వీనర్ గణేష్ రైతులకు రాయితీపై ఉలవలు పంపిణీ చేశారు. ఏవో మాట్లాడుతూ మండలానికి మొత్తం 400 క్వింటాళ్లు కేటాయించారని, అన్ని సచివాలయాల్లో పంపిణీ చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి బిసి సెల్ జిల్లా ఉపాధ్యక్షులు కృష్ణమూర్తి, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు జయకుమార్, నాయకులు రామిరెడ్డి, దాదు, మారుతిప్రసాద్, చెన్నప్ప, రైతులు పాల్గొన్నారు.

ఉలవలు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు గణేష్

గుడిబండ : మండలంలోని మందలపల్లి గ్రామంలో ఏవో వీరనరేష్ రాయితీ ఉలవల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కొంకల్లు, ఎస్.రాయపురం, తదితర రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకున్న రైతులకు ఉలవలు పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మందలపల్లి రైతు సేవా కేంద్రం అధికారి ఉమ, రైతులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

పర్యావరణాన్ని కాపాడి భవిష్యత్తు తరాలకు అందించాల్సిన ప్రతి ఒక్కరిపై ఉందని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 'మన పర్యావరణం-మన చేతుల్లోనే' అంశంపై కళాశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అందులో ప్రతిభ చూపిన విద్యార్థులకు గురువారం పట్టణంలోని జూనియర్ కళాశాల ఆర్‌డిటి ఆడిటోరియంలో ప్రిన్సి పల్ సుదర్శన్ అధ్యక్షతన బహుమ తుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతను కాపాడుటలో ప్రజలను భాగస్వాములను చేయాలన్నారు. విద్యార్థులు పర్యావరణం పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ జయప్ప మాట్లాడుతూ జెవివి ఆధ్వర్యంలో సైన్స్ ప్రచార, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు చేపట్టడం హర్షణీయమన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలన్నారు. జెవివి జిల్లా కార్యదర్శి హరి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రధాన సవాళ్లలో ఒకటిగా మారిందన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించా లన్నారు. సత్యసాయి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఆదిశేషురెడ్డి మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని పిలుపునిచ్చారు. అనంతరం వ్యాసరచన పోటీ విజేత విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ మూర్తి, ప్రభుత్వ డిగ్రీ కళా శాల అధ్యాపకులు దేవిశెట్టి రామన్న, సత్యసాయి కళాశాల ఏవో కేశవయ్య, జెవివి సభ్యులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి

అంగన్వాడీ కేంద్రంలో ప్లేట్లు, గ్లాసులు వితరణ

రొద్దం : మండలంలోని నల్లూరు-2 అంగన్వాడీ కేంద్రంలో గురువారం ఎస్సీ కాలనీకి చెందిన నరసింహ మూర్తి, మల్లేశ్వరి దంపతులు ప్లేట్లు, గ్లాసులు, 2 కుర్చీలు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐసిడిఎస్ సూపర్‌వైజర్ అనురాధ హాజరై మాట్లాడారు. పోషణ మాసోత్సవాల సందర్భంగా చిన్నపిల్లల తల్లులు, గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, అంగన్వాడీ కార్యకర్తలు పి.లక్ష్మిదేవి, జె.లక్ష్మిదేవి, తదితరులు పాలొన్నారు.

చిన్నారులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేస్తున్న దాతలు

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించండి

రొద్దం : రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం మండలంలోని 35 మంది డీల ర్లు తహశీల్దార్ కార్యాలయంలో సీనియర్ ఆసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేశారు. డీలర్లు మాట్లాడుతూ గతంలో ఉన్న డీలర్లు ఒక్కో షాపులో 10 నుంచి 20క్వింటాళ్ల మిగులు బియ్యం ఉంచారన్నారు. ప్రస్తుతం ఉన్న డీలర్లకు అంతో ఇంతో డబ్బులు కట్టించి వారు తప్పుకొన్నారన్నారు. స్టాక్ పాయింట్ నుంచి ఒక్కో డీలర్‌కు 2, 3 క్వింటాళ్ల బియ్యం తక్కువ వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండియు లాగిన్ తీసి డీలర్లకు లాగిన్ ఇవ్వాలని, లాగిన్ మండలంలోని అందరికీ ఒకేసారి ఇవ్వాలన్నారు. స్టాక్ పాయింట్ నుంచి సక్రమంగా బియ్యం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.

రేషన డీలర్ల సంఘం అధ్యక్షుడిగా శిద్దన్న

రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడిగా శిద్ధన్నను ఎన్నుకున్నారు. మండల వ్యాప్తంగా ఉన్న 35 మంది డీలర్లు రొద్దం గ్రామానికి చెందిన శిద్ధన్నను ఎన్నుకొన్నారు. శిద్ధన్న మాట్లాడుతూ డీలర్లు తనపై నమ్మకం ఉంచి అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు సంతోషంగా ఉందన్నారు. డీలర్ల సమస్యలపై రాజీ నిత్య పోరాటం చేస్తానని తెలిపారు.

రేషన డీలర్ల సంఘం అధ్యక్షుడు శిద్ధన్నను సన్మానిస్తున్న డీలర్లు

యోగా క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందజేత

కదిరి టౌన్ : రూరల్ మండలంలోని ఎరుకలవాండ్లపల్లి సమీపంలో ఉన్న హరీష్ పాఠశాలకు చెందిన యోగా క్రీడాకారులకు ప్రిన్సిపల్ యంయస్. కిరణ్ గురువారం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల విశాఖపట్నం జిల్లాలోని భీమిలీలో జరిగిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో తమ పాఠశాలలో 10, 8, 7వ తరగతి చదువుతున్న శ్రీజా రెడ్డి, దీక్షిత, శైలజ, వినూత్న, లహరి, రేవంత్ రాయల్, కార్తీక్ నాయుడు, యువరాజ్, చరణ్ నాయక్ పాల్గొని ప్రతిభ కనబరిచారన్నారు. వీరిలో ఇరువురు క్రీడాకారులు హిమాచల్ ప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి యోగా పోటీల్లో పాల్గొంటారన్నారు. తమ పాఠశాల విద్యార్థులు చదువుతో పాటు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొనడం సంతోషదాయకంగా ఉందన్నారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు ప్రసన్న కుమార్‌ను ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు. అన్నివిధాల సహాయ సహకారాలు అందించిన ఉమ్మడి అనంతపురం జిల్లా క్రీడా అసోసియేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

రైతులు ఈకేవైసీ చేయించుకోండి : ఏవో

లేపాక్షి : ఖరీఫ్-2024కు సంబంధించి మండల వ్యాప్తంగా రైతులు ఈ నెల 23వ తేదీ లోపు ఖచ్చి తంగా పంట నమోదు, ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్రీలత గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకూ 9,164 ఎకరాల్లో 5,115 మంది రైతులు పంట నమోదు చేసుకున్నారన్నారు. వరి పంట ఇన్సూరెన్స్ పంటల జాబితాలో ఉందని, వరి సాగు చేసే రైతులు 23వ తేదీ లోపు నాట్లు వేసుకొని సంబంధిత రైతు సేవా కేంద్రంలో పంట నమోదు చేసుకోవాలన్నారు.

'బ్లూమూన్'లో ఫ్రెషర్స్ డే

కదిరి టౌన్ : పట్టణంలోని బ్యూమాన్ కళాశాలలో గురువారం ఫ్రెషర్స్‌డేను నిర్వహించారు. సీనియర్ విదార్థులు జరియర్ విద్యార్థులకు ఆహ్వానం పలుకుతూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసమావేశానికి ముఖ్య అతిథిగా విద్యాసంస్థ అధినేత మంచి శివశంకర్ హాజరై విద్యార్థులకు పలు సూచనలు చేశారు.ఈసందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్లూమూన్ ఇన్‌స్టిట్యూట్ అధినేత శివశంకర్‌ను సన్మానిస్తున్న అధ్యాపక బృందం

పేట్రేగిన మట్టి మాఫియా

- మొన్న సోమందేపల్లి, నేడు పెనుకొండ
- రూ.1000 ప్రకారం వెయ్యి ట్రాక్టర్ల లోడ్లకు ఒప్పందం
- ప్రయివేటు లేఅవుట్‌కు మట్టి అక్రమ తరలింపు
- రైతు పొలాలకే అనుమతిచ్చామంటున్న ఇరిగేషన్ అధికారులు

ప్రజాశక్తి-పెనుకొండ

ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు చేసి ప్రవేటు లేఅవుట్లకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మొన్న సోమందేపల్లి లో నేడు పెనుకొండలో మట్టి మాఫియా పెట్రేగిపోతోంది. పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని కొండాపురం ముత్యాల చెరువులో కొందరు చోటామోటా నాయకులు జెసిబి తో మట్టిని తవ్వి పట్టణంలోని ఓ ప్రైవేటు లేఅవుట్‌కు తరలిస్తున్నారు. 15 ట్రాక్టర్లతో ఉదయం నుంచి మట్టిని తవ్వి సొమ్ము చేసుకుంటున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు చేస్తున్నారు. దీంతో చెరువులో పెద్ద పెద్ద గోతులు ఏర్పడి ప్రమాదకర స్థాయికి చేరుకున్నాయి. చెరువులో పిల్లలు వెళితే ప్రమాదాలు జరిగే ప్రమాదంఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మూగజీవాలు సైతం గోతుల్లో పడి మృతిచెందిన సంఘటనలు ఉన్నాయని వాపోతున్నారు.

ప్రయివేటు లేఅవుట్‌కు తరలిస్తూ...

పట్టణంలో వెలిసిన ఓ ప్రయివేటు లేఅవుట్‌కు మట్టి మాఫియా మట్టిని అక్రమంగా తరలిస్తోంది. ఒక ట్రాక్టర్ లోడ్ మట్టికి రూ.1000 ప్రకారం వెయ్యి ట్రాక్టర్ల లోడ్లకు ఒప్పందం కుదుర్చుకొని మట్టిని తరలిస్తున్నారు. లేఅవుట్ చదును చేయాలంటే సుమారు మూడు నుంచి నాలుగు వేల మట్టి లోడ్లు అవసరం ఉంటుందని భావించిన వారు దశలవారీగా మట్టి తరలించి సొమ్ము చేసుకునేందుకు ప్రణాళిక రచించారు. ప్రస్తుతం ఉదయం నుంచి ఏకధాటిగా 15 ట్రాక్టర్లతో 300 ట్రాక్టర్లు మట్టిని తవ్వారు.

రైతు పొలాలకు మాత్రమే అనుమతిచ్చాం: ఇరిగేషన్ డిఇ

రైతుల పొలాల్లోకి మాత్రమే మట్టి తరలించేందుకు అనుమతి ఇచ్చామని ఇరిగేషన్ డిఇ లక్ష్మీనారాయణ తెలిపారు. రైతు పొలాల్లోకి 60 ట్రాక్టర్ల లోడ్లను తీసుకెళ్తామని అనుమతి తీసుకున్నారని ప్రయివేటు లేఅవుట్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి ఇవ్వమని ఆయన చెప్పారు. అక్రమంగా మట్టిని తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు.

అధికారులనూ లెక్కచేయని వైనం..

మట్టిని అక్రమంగా తరలిస్తున్న మట్టి మాఫియా అధికారులను ఏమాత్రం లెక్క చేయకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోంది. అధికారులు వెళ్లితే వారికి ఏదో ఒకటి చెప్పి ఆ నాయకుడు తెలుసు ఈ నాయకుడు తెలుసు అంటూ వారి ద్వారా ఫోన్లు చేయించి వెనక్కు పంపుతున్నారు. ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సైతం మట్టి మాఫియా ఆగడాలను అరికట్టలేక నిమ్మకుండి పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అడ్డుకుంటే ఏ నాయకుడి నుంచి ఫోన్ వస్తుందో అంటూ భయపడుతూ కాలం వెల్లదీస్తున్నారు. మట్టి మాఫియాను మాట్లాడాలంటేనే అధికారులు భయపడే స్థాయికి ఎదిగిందంటే ఆశ్చర్య పోవాల్సిన అవసరం లేదు.

చెరువులో మట్టిని తవ్వి ట్రాక్టర్‌లో వేస్తున్న దృశ్యం

తరలించిన మట్టిని లేఅవుట్‌లో చదును చేస్తున్న దృశ్యం

జెసిబి కింద పడి యువకుడు మృతి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం నక్కలపల్లి గ్రామంలో జరిగిన ప్రమాదంలో జెసిబి కింద పడి యువకుడు మృతిచెందాడు. గురువారం గ్రామంలో జెసిబితో కంపచెట్లు తొలగిస్తున్న సమయంలో జెసిబి హెల్పర్ సంతోష్‌కుమార్ (20) ప్రమాదవశాత్తు జెసిబి కింద పడి మృతిచెందాడు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీ కొన్న బస్సు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలోనిసాయి బాబా ఆలయం వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఊటకురు నుంచి ఆత్రేయ కళ్యాణ్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంలో హిందూపురం వస్తుండగా హిందూపురం నుంచి పెనుకొండ వైపు వెళుతున్న బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీ కొంది. ఈ ప్రమాదంలో ఆత్రేయ కళ్యాణ్‌ను తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రుడిని జిల్లా ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అందించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు.

కాంగ్రెస్ పార్టీ నాయకుడు బిఎన్.మూర్తికి ప్రమాదం

మడకశిర రూరల్ : మండలంలోని బచ్చులయ్యపాలెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ బిఎన్.మూర్తి(నరసింహమూర్తి) గురువారం రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఆయన ప్రయాణిస్తున్న కారును ఎదురుగా వస్తున్న వాహనం ఢీకొంది. ఈ ప్రమాదం వారికి గాయాలు కావడంతో చికిత్స కోసం బెంగళూరుకు తరలించారు.

కర్నాటక మద్యం పట్టివేత

మడకశిర : మండలంలోని ఈ.ఆచంపల్లి గ్రామంలో తిమ్మయ్య కర్నాటక మద్యం విక్రయిస్తుండగా సిఐ రామారావు ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేసి అరెస్టు చేశారు. అతడి వద్ద ఉన్న వివిధ బ్రాండ్‌ల 4.7 లీటర్ల కర్నాటక మద్యంను సీజ్ చేసి అతడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బ్రెయిన్ స్ట్రోక్‌తో వీఆర్వో మృతి

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండల పరిధిలోని దేమకేతేపల్లి విఆర్ఒ శ్రీనివాసులు గురువారం తెల్లవారుజామున బ్రెయిన్‌స్ట్రోక్‌తో మృతిచెందాడు. మూడు రోజుల క్రితం అకస్మాత్తుగా స్పృహ కోల్పోయిన శ్రీనివాసులును కుటుంబ సభ్యులు అనంతపురంలోని సవేరా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అక్కడ చికిత్సకు శరీరం సహకరించక మృతిచెందాడు. మృతుడి స్వగ్రామం అయిన పరిగి మండలం శాసనకోటలో అంత్యక్రియలు నిర్వహించారు. తహశీల్దార్ ఆనంద్ బాబు, విఆర్ఒలు, దేమకేతేపల్లి సర్పంచి తిరుమలేష్ మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

ప్రజాశక్తి - నల్లచెరువు

ఆటో డ్రైవర్లు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ లింగన్న హెచ్చరించారు. గురువారం స్థానిక పెట్రోల్ బంక్ సమీపంలో ఆటో డ్రైవర్లకు డ్రైవింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మద్యం తాగి ఆటోలో నడపరాదన్నారు. రోడ్డు నియమాలను పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు, పోలీసులు పాల్గొన్నారు.

పౌష్టికాహార మాసోత్సవాలు

ప్రజాశక్తి - తలుపుల

గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందని ఐసిడిఎస్ సూపర్వైజర్ నిహారిక పేర్కొన్నారు. గురువారం తలుపుల మండల పరిధిలోని పెద్దన్నవారిపల్లి గ్రామంలో పౌష్టికాహార మాతోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవడం వల్ల మెరుగైన ఆరోగ్యంగా చేకూరుతుందని పుట్టబోయే బిడ్డ ఎటువంటి అనారోగ్యాలు లేకుండా ఉంటారని అన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందజేసే పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు కాంతమ్మ, పుష్పాంజలి, విజయలక్ష్మి, మంజుల, అనిత, ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికలు సిద్ధం చేయండి

ప్రజాశక్తి - కొత్తచెరువు

మండలంలోని అన్ని శాఖల అధికారులు మండల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీడీవో బారాన్‌సాహెబ్ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ ధ్యేయంగా 2047కు రాష్ట్రాన్ని అభివృద్ధి పరిచే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నాగరాజు, ఏవో నటరాజు, ఆర్డబ్ల్యూఎస్ జేఈ ఓబులేసు, పిఆర్ జేఈ నాగరాజు, ఏపీవో నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దర్గా అభివృద్ధికి సాయం

తలుపుల : తలుపుల పంచాయతీ కుమ్మరపేట లో ఉన్న బాబా షర్ఫుద్దీన్ దర్గా పునర్నిర్మాణం కోసం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సాయం అందజేశారు. సొంత నిధులతో 30 ట్రిప్పులు ఇసుక తరలించడానికి అంగీకరించారని టిడిపి మండల కన్వీనర్ ముబారక్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజారెడ్డి, రఘునాథ్ రెడ్డి, పురం శెట్టి రాధాకృష్ణ, కుమ్మరపేట బూత్ కన్వీనర్ అశోక్ చక్రవర్తి, గణేష్, అలీ, ఐటీడీపీ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వందరోజుల ప్రగతిపై సర్వే

ప్రజాశక్తి - నల్లచెరువు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి వందరోజులు పూర్తి అయిన సందర్భంగా వందరోజుల ప్రగతిపై ఇంటింటి సర్వే నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ శకుంతల తెలిపారు. మండల పరిధిలోని 10 సచివాలయలలో శు క్రవారం నుంచి 26వ తేదీ వరకు ఇంటింటి సర్వే చేయనున్నట్లు చెప్పారు. ఇందుకోసం ఒక్కొక్క సచివాలయానికి ఒక స్పెషల్ ఆఫీసర్‌ను నియమించినట్లు ఆమె తెలిపారు.

ఉలవలు పంపిణీ

ప్రజాశక్తి - ముదిగుబ్బ

ఖరీఫ్‌లో వేరుశనగ సాగు చేయని రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగులో భాగంగా స్థానిక 4వ సచివాలయంలో సబ్సిడీతో ఉలవలు పంపిణీ చేశారు. పెసలు, జొన్నలు కావాల్సిన రైతులు సంబంధిత సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి తుమ్మల మనోహర్, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ అనిత, నంద, చంద్ర, రామంజి, శీన తదితరులు పాల్గొన్నారు.

26న ప్రత్యేక సమావేశాలు

కదిరి అర్బన్ : ఈనెల 26న మండల పరిధిలోని ప్రతి సచివాలయంలో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ అంజినప్ప తెలిపారు. 'ఇది మంచి ప్రభుత్వం' అనే కార్యక్రమం కింద శుక్రవారం నుండి 26వ తేదీ వరకు కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 100 రోజుల పాలన గురించి వివరించడానికి ప్రతి ఇంటికి వెళు తున్నట్లు చెప్పారు.

పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం : మంత్రి

అన్నాక్యాంటీన్లను ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యే పల్లె సింధూర, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

రాష్ట్రంలో పేదల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. ఈ మేరకు వారు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి, ఎల్‌పి సర్కిల్‌లో గల అన్నా కాంటీన్లను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ పేద ప్రజల కోసం ఐదు రూపాయలు కే ఆహారం అందించేందుకు అన్నా క్యాంటీన్లను ఏర్పాటు చేశామన్నారు, ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర నాయకులు చిలకం మధుసూదన్ రెడ్డి, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి క్రైమ్ : పేదల కడుపు నింపడమే లక్ష్యంగా ప్రభుత్వం అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేసిందని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం సాయంత్రం ఎనుములపల్లి సమీపంలో ఉన్న అన్న క్యాంటీన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలు ఎవరు ఆకలితో ఇబ్బంది పడకూడదనే ఏకైక లక్ష్యంతో అన్నా క్యాంటీన్లకు శ్రీకారం చుట్టారన్నారు. ఈ అవకాశాన్ని పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, పట్టణ కన్వీనర్ రామాంజనేయులు, మైనార్టీ విభాగం నాయకుడు మహమ్మద్ రఫీ, కౌన్సిలర్ వెంకట రమణమ్మ, రామ్ లక్ష్మణులు, టిడిపి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర సాధన కోసం ప్రణాళిక : కలెక్టర్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

స్వర్ణాంధ్ర - 2047 లక్ష్యసాధనకు జిల్లా, మండల, మున్సిపల్ స్థాయి పరిధిలో ప్రణాళికలు సిద్ధం చేసి అందజేయాలని కలెక్టర్ టిఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ అమరావతి నుండి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ తో పాటు జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ 2047 లక్ష్యసాధనకు 100 రోజుల, వార్షిక, ఐదేళ్ల ప్రణాళికలు ఈ నెలాఖరుకు అందజేయాలన్నారు. జిల్లా స్థాయిలో సమీకృతం చేసి అక్టోబర్ 15లోగా అందజేయాలన్నారు. ఐదేళ్ల దీర్ఘకాలిక ప్రణాళికల అమలుకు అధికారులు చొరవ చూపాలని కలెక్టర్ ఆదేశించారు. నవంబర్ 1న రాష్ట్రస్థాయిలో ప్రణాళిక అమలుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లో, పరిశ్రమలు, మానవ వనరులు, వైద్య విధానం, నైపుణ్య అభివృద్ధి, లక్ష్యసాధన ఆచరణ సాధ్యం అయ్యే విధంగా ప్రతిపాదనలు అందజేయాల్సి ఉంటుందన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు, పరిశ్రమలలో నైపుణ్య అభివృద్ధి తదితర సమగ్ర వివరాలు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఒ విజయ్ కుమార్, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, తదితరులు

మారాల రిజర్వాయర్‌ను కృష్ణా జలాలతో నింపుతాం

సబ్సిడీ ఉలవలు అందజేస్తున్న ఎమ్మెల్యే, మాజీమంత్రి

ప్రజాశక్తి - బుక్కపట్నం

పుట్టపర్తి నియోజకవర్గంలోని బుక్క పట్నం, మారాల రిజర్వాయర్‌ను కృష్ణ జలాలతో నింపి రైతులను ఆదుకుంటామని ఎమ్మెల్యే పల్లె సింధూర పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన ప్రత్యామ్నాయ విత్తనాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ధ్యేయంగా టీడీపీ కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. బెట్టను తట్టుకునే వంగడాలను తీసుకొచ్చేలా వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం దష్టికి తీసుకెళ్లి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి నాగలక్ష్మి రాజు, ఎంపీడీవో శ్రీనివాసులు, వ్యవసాయ శాఖ అధికారి సతీష్ బాబు, మండల కన్వీనర్ మల్లిరెడ్డి, పత్తి చంద్రశేఖర్, మాజీ సర్పంచి సాకే యశోద, గంగాధర్, సామకోటి ఆదినారాయణ, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు..

కొత్తచెరువు : రైతుల సంక్షేమమే టిడిపి ప్రభుత్వ ధ్యేయమని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర పేర్కొన్నారు. కొత్త చెరువులోని వ్యవసాయ కార్యాలయం వద్ద గురువారం మండల వ్యవసాయ అధికారి నటరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాయితీతో ప్రత్యామ్నాయ విత్తనాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈసందర్భంగా 10 కేజీల ఉలవల కిట్లను ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి తో పాటు మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ స్వయం ప్రభ, తహశీల్దార్, నాగరాజు, ఎంపిడిఒ బారాన్ సాహెబ్ , ఏవో నటరాజు, టీడీపీ నాయకులు ఎస్ శ్రీనివాసులు, రామకృష్ణ, శ్రీనివాసులు, జన సేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పత్తి చంద్రశేఖర్, టీడీపీ నాయకులు లక్ష్మీనారాయణ , మాణిక్యం బాబా, వంశీ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత సహకార సంఘాల ఏర్పాటుకు చర్యలు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జిల్లాలోని చేనేత కార్మికులు మాస్టర్ వీవర్లు నూతనంగా సహకార సంఘాలు ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని అందుకు దరఖాస్తు చేసుకోవాలని చేనేత జౌళి శాఖ జిల్లా అధికారి ఆర్. రమేష్ తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. పట్టణ ప్రాంతాల్లో కనీసం 50 మంది, గ్రామీణ ప్రాంతాల్లో 30 మంది కలసి సంఘం ఏర్పాటు చేసుకోవచ్చున్నారు. సంఘ సభ్యులు తమ వాటాగా ఒక్కొక్కరు వెయ్యి రూపాయలు చెల్లించాలని, ప్రభుత్వ వాటా తమ వంతు జమ చేస్తుందని అన్నారు. సంఘం ఏర్పాటు వల్ల చేనేతలు తమ ఉత్పత్తులను రాష్ట్ర, జాతీయ వస్త్ర ప్రదర్శనలో విక్రయించుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. అలాగే ఆప్కో ఇతర ప్రభుత్వ సంస్థల నుండి ఆర్డర్లు పొందే అవకాశం ఉంటుందన్నారు. సంఘాల సభ్యులు చెల్లించే వాటా ధనం ఆయా మండలాల్లో సహకార బ్యాంకులలో డిపాజిట్లు చేయబడుతుందన్నారు. సంఘాలకు ప్రభుత్వ పథకాలతో పాటు బ్యాంకుల నుంచి తక్కువ వడ్డీకి రుణాలు అందించడం జరుగుతుందన్నారు. చేనేతలు మరిన్ని వివరాలకు, దరఖాస్తు ఫారాలకు పుట్టపర్తి లోని దీన జనోద్ధారణ భవన సదుపాయంలోని చేనేత జౌళి శాఖ కార్యాలయంలో సంప్రదించవచ్చున్నారు.

వరద బాధితులకు పారిశుధ్య కార్మికుల విరాళం

ప్రజాశక్తి-హిందూపురం

విజయవాడ వరద బాధితుల సహాయార్థం హిందూపురం మున్సిపల్ వర్కర్స్ ఆధ్వర్యంలో కార్మికులు రూ. 30వేలు సేకరించారు. ఈ నగదును గురువారం నాయకులు బ్యాంకులో ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఖాతాకు డిపాజిట్ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్‌పి శ్రీనివాసులు మాట్లాడుతు వరదలతో అతలకుతలమైన విజయవాడను రాష్ట్ర వ్యాప్తంగా పారిశుధ్య కార్మికులు అక్కడికి వెళ్లి తమ సేవలను అందించి, వాడలన్నీ శుభ్రం చేశారన్నారు. అక్కడి నుంచి వచ్చిన వెంటనే తమ వంతుగా వరద బాధితులను ఆదుకోవాలని రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కార్మికులు అందరు తమ వంతు సహాయాన్ని అందించడానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు రాము, మున్సిపాలిటీ యూనియన్ కార్యదర్శి జగదీష్, అధ్యక్షులు మల్లికార్జున, కోశాధికారి ఆనంద్, నాయకులు రామచంద్ర, బాబయ్య, మూర్తి, మహిళలు సుబ్బలమ్మ, కవిత, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకులో డిపాజిట్ చేసిన స్లిప్ ను చూపిస్తున్న సిఐటియు, కార్మిక సంఘం నాయకులు

అనుచిత వ్యాఖ్యలపై ఫిర్యాదు

పుట్టపర్తి రూరల్ : కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు రాహుల్ గాంధీ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బిజెపి ,శివసేన నాయకులపైకఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్పీ కార్యాలయంలో గురువారం ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోటా సత్యం, హిందూపురం ఎంహెచ్ ఇనాయకుల్లాతోపాటు జిల్లా నాయకుల ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కోటా సత్యం మాట్లాడుతూ భారతదేశాన్ని సుదీర్ఘకాలం పరిపాలించిన కుటుంబ సభ్యుల పైన లేనిపోని అబాండాలు వేస్తూ రాహుల్ గాంధీ కించపరిచే విధంగా ఆరోపణలు చేయడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. బిజెపి, శివసేన చేస్తున్న అరాచకాలతో ప్రజలు ఎంతో నష్టపోతున్నారని, వారి ఆగడాలకు అడ్డకట్ట వేయడానికి కాంగ్రెస్ పార్టీ సమాయత్తమవుతుందని తెలిపారు. అంతకుమునుపు వారు గణేష్ కూడలిలో ధర్నా నిర్వహించారు. బిజెపి, శివసేన నేతలపై తక్షణ చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కన్వీనర్లు, నాయకులు, పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్ పేరుతో ఆర్భాటాలు తగదు

ముదిగుబ్బ : స్వచ్ఛభారత్ మిషన్ పథకం అమలులో భాగంగా ఆర్భాటాలు ర్యాలీలు చేయడానికి పరిమితమయ్యారని సిపిఐ నాయకులు చల్లాశ్రీనివాసులు విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం స్వచ్ఛభారత్ కార్యక్రమం పేరుతో ఎక్కడ చూసినా ర్యాలీలు , ప్రభుత్వాధికారులచే సమావేశాలు, అవగాహన సదస్సులు, విద్యార్థులచే మానవహారాలకే పరిమితమయిందని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమాల పేరుతో పబ్లిసిటీ కోసం కోట్ల రూపాయల ఖర్చు పెడుతున్నారే కానీ స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహణలో క్షేత్రస్థాయిలో కీలకంగా పనిచేస్తున్న పారిశుద్ధ కార్మికుల వేతనాలు పెంపు, ఉద్యోగ భద్రత గురించి పట్టించుకోవటం లేదని విమర్శించారు. ఇప్పటికైనా ఈ పథకం అమలు నిర్వహణలో ముఖ్య పాత్ర వహిస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

హిందూపురం : రోజు రోజుకు దెబ్బతింటున్న పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని మైసూర్‌కు చెందిన రీజనల్ మ్యూజియం ఆఫ్ నేచురల్ హిస్టరీ శాస్త్రవేత్తలు సూచించారు. రెండు రోజులుగా వారు హిందూపురం పట్టణంలోని ఎంజీఎం హైస్కూల్, చిన్మయ విద్యాలయలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ గంగప్ప పర్యావరణ విద్య గురించి, బయో డైవర్సిటీ ఆఫ్ స్కూల్ గురించి వివరించారు. పర్యావరణ సమతుల్యత గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి మొక్కలు, జంతువుల గురించి సీనియర్ శాస్త్రవేత్తలు డాక్టర్ యోగేశ్వర్ , డాక్టర్ చంద్రశేఖర్ వివరించారు. రైనోడే సందర్భంగా రైనో గురించి వివరించారు. సీనియర్ టెక్నీషియన్ శ్రీనివాసులు రైనోసారస్ బొమ్మలను టీచింగ్ మోడల్ గా బంక మట్టితో తయారుచేసి విద్యార్థులకు చూపించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'సత్యసాయి' కార్మికుల హర్షం

పుట్టపర్తి అర్బన్ : సత్యసాయి తాగునీటి సరఫరా కార్మికుల పోరాటం ఫలించింది. ప్రభుత్వం స్పందించి బకాయి వేతనాలు విడుదల చేయడంతో కార్మికుల్లో ఆనందం వెల్లువిరిసింది. గురువారం హనుమాన్ సర్కిల్ లో కార్మికులు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రితో పాటు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం తప్పిదాల వల్లే, కార్మికులు ఇబ్బందులు పడ్డారన్నారు. 7 నెలల బకాయిలు, పిఎఫ్, తదితర సమస్యలు ప్రభుత్వం పరిష్కరించడం జరిగిందన్నారు. త్వరలోనే మిగిలిన సమస్యలకు కూడా పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సామ కోటి ఆదినారాయణ, రామ్ లక్ష్మణ్ లు, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి పత్తి చంద్రశేఖర్, కార్మిక నాయకులు మధుసూదన్, చంద్ర, శ్రీనివాసులు, సోము, చందు, ప్రభు పాల్గొన్నారు.

'కూటమి' హయాంలో రాష్ట్రాభివృద్ధి : ఎమ్మెల్యే

కదిరి టౌన్ : కూటమి ప్రభుత్వ నేతృత్వంలో రాష్ట్రం ప్రగతి పథంలో నడుస్తోందని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ స్పష్టం చేశారు . మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని 20 వార్డులో పర్యటించనున్నట్లు చెప్పారు. కూటమీ ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా 'ఇది మంచి ప్రభుత్వం' అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతతోనే పర్యావరణ పరిరక్షణ

హిందూపురం : పరిసరాల పరిశుభ్రతతో పర్యావరన పరిరక్షణ సాధ్యమని కౌన్సిలర్ రహమత్ బీ అన్నారు. స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని మోడల్ కాలనీలో పారిశుధ్యకార్యక్రమం చేపట్టారు. అనంతరం ఉర్దూ పాఠశాలలో విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్ శంకర్, పాఠశాల హెచ్ఎం హబీబా, ఉపాధ్యాయులతో పాటు పర్యావరణ కార్యదర్శులు కె. రమేష్, జి రమేష్, మహమ్మద్ షబ్బీర్, డి శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.